ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | గురువారం | 23.07.2026 | సంపుటి : 2 | సంచిక : 21 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98



## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. 03

## ట్రాన్స్‌కో డీఈ ఇంటిపై ఏసీబీ దాడులు

### భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు

హైదరాబాద్ మాదాపూర్ మీనాక్షి స్కైలాంజ్ టవర్స్‌లోని వెంకటరమణ ఇంటికి ఉదయమే ఏసీబీ సిటీ రేంజ్-2 డీఎస్పీ మాజిద్‌ఖాన్ నేతృత్వంలోని బృందాలు చేరుకొని సోదాలు నిర్వహించాయి. అలాగే ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న ఖైరతాబాద్‌లోని రెడ్కో కార్యాలయంతోపాటు హైదరాబాద్‌లో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 9 ప్రాంతాల్లోని ఆయన సన్నిహితులు, బినామీల ఇళ్లలో వేర్వేరు బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి.



03

## ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు

### సోమవారానికి విచారణ వాయిదా వేసిన హైకోర్టు

రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డిసిపి లావణ్య

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలం టూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉ న్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరఫు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. 03



# కాంగ్రెస్ vs బీజేపీ

### రణరంగంగా మారిన బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయ ప్రాంతాలు

కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

**లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం**

గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు

**ఇరువర్గాల దాడులతో ఉద్రిక్తత**

రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.



హైదరాబాద్, జూలై 22 : రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి -మిగతా 2 లో..



## ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదు

02

### కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు బిజెపి ఎత్తులు

కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు

ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి

సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్టానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు.

**వికారాబాద్, జూలై 22 :** పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. -మిగతా 2 లో..

## కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

కొడంగల్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

**'ఎల్‌నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ**

వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్

2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్'

ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష




'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. 03



## తెలంగాణకు కేంద్రం శుభవార్త

### 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం

హైదరాబాద్, జులై 22 : తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం భుభవార్త తెలిపింది.రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు -మిగతా 2 లో..

## సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

### జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం

సిఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ

ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు.



హైదరాబాద్, జూలై 22 : గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం -మిగతా 2 లో..

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

## కొడంగ్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్

**వికారాబాద్, జూలై 22 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని..




మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అఃఊఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి కరీంనగర్‌లో దొంగల బీభత్సం

### వృద్ధుడిని, మహిళలను కట్టేసి దోపిడీ

**కరీంనగర్,జూలై22 :** కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఘోర దారి దోపిడీ కలకలం రేపింది. ఆయుధాలతో, ముసుగులు ధరించి ఇంట్లోకి ప్రవేశించిన ముఠా సభ్యులు కుటుంబ సభ్యులను కత్తులు, తుపాకులతో బెదిరించి, విచక్షణారహితంగా దాడి చేసి భారీగా సొత్తును దోచుకెళ్లారు. అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో, ఇంట్లో ఉన్న వృద్ధుడైన యజమాని తన కొడుకులు ఎవరైనా వచ్చారన్న భావనతో తలుపు తీశాడు. వెంటనే ముసుగులు ధరించి లోపలికి చొరబడ్డ దుండగులు అతనిపై దాడి చేశారు. వృద్ధుడిని తాళ్లతో బంధించి, ముక్కు నుంచి రక్తం వచ్చేలా దారుణంగా చితకబాదారు. ఆ తర్వాత ఇంట్లోని ముగ్గురు మహిళలను పిస్టళ్లు, కత్తులతో బెదిరించి, బట్టలు, కాళ్లకు–చేతులకు ఓణీలతో కట్టేసి తీవ్రంగా భయాందోళనకు గురిచేశారు. లోపల విధ్వంసం సృష్టించిన దొంగలు, పెనుగులాట మధ్య ఇంట్లోని బంగారంతో పాటు సుమారు రూ.50 లక్షల కంటే ఎక్కువ నగదును దోచుకెళ్లారు. ఆ తర్వాత, ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైకులను కూడా దొంగిలించి పరారయ్యారు. బైపాస్ నుంచి మానేరు బ్రిడ్జి మీదుగా వరంగల్ వైపు పారిపోయినట్లు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ప్రాథమికంగా గుర్తించారు. దుండగులు లోపలికి రాగానే నోరు విప్పవద్దని బెదిరించారని బాధితురాలు తెలిపారు. తమ వద్ద ఉన్న రివాల్వర్లు, కత్తులు చూపిస్తూ తమను కాళ్లు, చేతులు కట్టేసి హింసించారని, ఇంట్లోని బంగారం, పైసలన్నీ పట్టుకెళ్లారని కన్నీటిపర్యంతమయ్యారు. దొంగలు హిందీ మాట్లాడారని, వారి వద్ద నకిలీ పిస్టల్ సహా ఇతర ఆయుధాలు ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్‌లతో సహా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దీనిపై కరీంనగర్ టౌన్ డిసిపి వెంకటరమణ మాట్లాడుతూ.. ఘటనపై సమాచారం రాగానే అన్ని ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించాం. బాధితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఉత్తర భారతదేశానికి చెందిన వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారిస్తున్నాం. అలాగే, బాధితుల పెద్ద అల్లుడు ఢిల్లీలో ఉంటారని, కుటుంబంలో కొన్ని గొడవలు ఉన్నట్లు తెలిసిందన్నారు. దాంతో కుటుంబ వివాదాల కోణంలోనూ, అలాగే వృత్తిపరమైన దొంగల పనా అనే అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నాం. ఎంత సొత్తు పోయిందనే దానిపై స్పష్టత కోసం పూర్తి వివరాలు సేకరిస్తున్నామని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

## కుమారుడిని కేసు నుంచి తప్పించే యత్నం

### మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు అరెస్ట్

**శ్రీకాకుళం, జూలై 22 :** వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని నివాసంలో ఆయన్ని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కుమారుడు ఆరవ్‌ను రోడ్డు ప్రమాదం కేసు నుంచి.. తప్పించేందుకు సీదిరి అప్పలరాజు ప్రయత్నించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారాలతో అప్పలరాజు బండారం బయటపడింది. ఈ కేసులో ఇప్పటికే అప్పలరాజు కుమారుడు అరవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వైపు అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేస్తారంటూ ఈ రోజు ఉదయం నుంచి ప్రచారం జరిగింది. దీంతో ఆయన నివాసానికి పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అప్పలరాజు అరెస్ట్‌ను కుటుంబ సభ్యులతోపాటు పార్టీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడికి భారీగా చేరుకున్న పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఇంకో వైపు సోంపేట 6వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టులో సీదిరి అప్పలరాజు ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణను కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ బైక్‌తో ఢీ కొట్టడంతో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందారు. ఈ కేసు నుంచి కుమారుడిని తప్పించేందుకు అప్పలరాజు తీవ్రంగా ప్రయత్నించారు. తన కుమారుడికి బదులుగా సిద్దార్థ త్యాడి అనే వ్యక్తిని జైలుకు పంపాలని అప్పలరాజు భావించారు. అందుకోసం బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, ప్రమాదానికి కారణమైన బైకును తప్పించి నేరం కప్పిపుచ్చేందుకు చూశారంటూ అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాజధాని రేడియల్ రోడ్లకు భూ సమీకరణ

### తాడికొండలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామసభ

### 50 ఎకరాలకు రైతులు అంగీకరించారన్న మంత్రి

**గుంటూరు,జూలై22(ఆర్ఎన్ఎ):** అమరావతి రైల్వే లైన్, ఇన్నర్ రింగు రోడ్డు, రాజధాని రేడియల్ రోడ్లకు భూ సమీకరణకు సంబంధించి తాడికొండలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2015లో భూ సమీకరణ మొదలైనా.. పనులు మాత్రం 2018లో మొదలయ్యాయని తెలిపారు. జగన్ హయాంలో ఐదేళ్లు పనులు జరగలేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలను అతి త్వరలోనే వినియోగంలోకి తెస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రైల్వే లైన్, రింగు రోడ్డు కోసం భూములు అవసరమని, రైతులు త్వరగా భూ సమీకరణకు వస్తే పనులు చేపడతామని చెప్పారు. తాడికొండ నుంచి రాజధాని వెళ్లే రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. తాడికొండ, కంతేరు, మోతడక, కొప్పురావూరు గ్రామాల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ వెళ్తుందని మంత్రి తెలిపారు. ల్యాండ్ అక్విజిషన్‌కు వెళ్లాలా లేక పూలింగ్‌కు వెళ్లాలా అనే దానిపై రైతుల అభిప్రాయాలు తీసుకున్నా మన్నారు. గ్రామసభలో మెజారిటీ రైతులు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకారం తెలిపారని చెప్పారు. 50 ఎకరాల భూమికి రైతులు ఇప్పటికే పత్రాలు సమర్పించారని.. వారి సందేహాలన్నింటికీ ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. రైతులకు అనువైన చోటే రిటర్న్ ఎ÷–లాట్లు ఇస్తామని వెల్లడించారు. రెండు, మూడు లేఅవుట్ డిజైన్లు చూపించి రైతుల అభిప్రాయం మేరకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. 2027 మార్చి నాటికి 350 కి.మీ ట్రంక్ రోడ్లు పూర్తవుతాయని, 2027 చివరి నాటికి అమరావతి లేఅవుట్లు పూర్తి చేస్తామని నారాయణ ప్రకటించారు. ఈ నెల25న ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను ప్రభుత్వానికి అప్పగిస్తామని, వచ్చే నెల 15న ఎమ్మెల్సీ క్వార్టర్స్, సెప్టెంబర్ మొదటి వారంలో మంత్రుల నివాసాలను అప్పగిస్తామన్నారు. ప్రతి 15 రోజులకు సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తున్నారని, అమరావతి పనులపై ప్రతిరోజూ తాను కూడా సమీక్ష చేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ పూలింగ్ వేగంగా పూర్ఖైతే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. రైల్వే శాఖ.. పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ వెంట సర్వీస్ రోడ్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు త్వరగా భూములు ఇస్తే అంతే త్వరగా ఎ÷–లాట్లు కేటాయిస్తామన్నారు. అమరావతి అభివృద్ధిలో రైతుల సహకారం కీలకమని తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు సహకరించిన రైతులకు మంత్రి నారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి




**ఒంగోలు,జూలై22 :** ప్రకాశం జిల్లా: గిద్దలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం, కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుల వివరాలు, గాయపడిన వారి గుర్తింపును అధికారులు సేకరిస్తున్నారు.

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం





చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్–ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## విజయవాడలో కాంగ్రెస్, బిజెపిల పరస్పర నిరసనలు

**విజయవాడ,జూలై22 :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అరెస్టు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా విజయవాడలో బీజేపీ కౌంటర్ ఆందోళన చేపట్టింది. ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన నిరసన ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపీ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు పార్టీ జెండాల కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్టు సమాచారం. విజయవాడలో మ్యూజియం రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ కార్యకర్తలు 'డౌన్ డౌన్ రాహుల్ గాంధీ', 'డౌన్ డౌన్ కాంగ్రెస్ పార్టీ' అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేస్తోందని వారు ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఒకేచోట చేరడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాంగ్రెస్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ, కొంతసేపు ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. అనంతరం, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ..'మోదీ ఇంటి ముట్టడి వెనుక అసలు శక్తులు బయటపడ్డాయి. దాడి వెనుక కాంగ్రెస్ అగ్రనేతల హస్తం ఉంది. జంతర్ మంతర్ నిరసనలకు కాంగ్రెసే సూత్రధారి. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెనుక ఉండి నడిపిస్తోంది కాంగ్రెస్ పార్టీనే. నిరసనల్లో ఒక్క నీట్ విద్యార్థి కూడా లేరు, కేవలం లెఫ్ట్ యూనియన్ నాయకులే ఉన్నారు. నిరసనల్లో అర్బన్ నక్సల్స్, 370 రద్దును వ్యతిరేకించే శక్తులు ఉన్నాయి. నీట్ లీకేజీకి సంబంధించి 15 మందిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడే ధైర్యం ప్రతిపక్షాలకు లేదు. నేపాల్, బంగ్లాదేశ్ తరహా అలజడులు సృష్టిస్తే ఉపేక్షించం. విద్యార్థులకు భరోసా, నిజమైన నీట్ బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు.

## నీట్ లీక్‌పై రాజకీయాలు తగవు

### చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది: నడ్డా

**న్యూఢిల్లీ, జూలై 22 :** నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల డిమాండ్స్, సమస్యలతో రాజకీయం చేసి లాభం పొందేందుకు ప్రయత్నించడం తగదని మంత్రి జేపీ నడ్డా అన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించట్లేదని మంత్రి నడ్డా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని అన్నారు.



## తెలంగాణకు కేంద్రం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్దారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎలాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷–లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలా బాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

# రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

- 'ఎల్‌నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ
- వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్
- 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్'
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష




**హన్మకొండ,జూలై22 :** 'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చరింగ్' చేయడం ద్వారా సంస్థల రుణభారం తగ్గించి, డిస్కంలను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 అంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని అంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని... మెసేజ్ ఆధారంగా అంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్ల బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'గృహజ్యోతి' పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం కంపెనీలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే ?రూ. 14,000 కోట్ల సబ్సిడీ నిధులను? కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.




## కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన

### హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి పొన్నం ఆందోళన

**సిద్దిపేట, జూలై 22 :** కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి పొన్నం ప్రభాకర్ ధర్నాకు దిగారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అరెస్టులను నిరసిస్తూ మహాధర్నా నిర్వహించడం జరిగింది. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన శాంతియుత పార్లమెంట్ మార్చ్‌పై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పొన్నం తెలిపారు.. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. నీట్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలి. పేపర్ లీకేజీపై కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలి. ఈ ఘటనల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన. మహా ధర్నాలో అన్ని మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుందని మంత్రి హెచ్చరించారు.

## నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి

**సంగారెడ్డి, జూలై 22 :** మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ - ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## అదుపుతప్పి టూవీలర్‌ను ఢీకొన్న ట్యాంకర్

### యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్, జూలై 22 :** ఔటర్‌ను ఆనుకుని నార్సింగి-పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన ట్యాంకర్.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న సుశీల్ కుమార్(28) అనే యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత అదుపు తప్పిన ట్యాంకర్ మరో కారు, స్కూటీని కూడా ఢీ కొట్టింది. దీంతో మొత్తం మూడు వాహనాలను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహాను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అలాగే గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సుశీల్ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఎల్‌నినో సన్నద్ధతపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం

### శాస్త్రీయ విశ్లేషణ ఆధారంగా కార్యాచరణ ప్రణాళిక

### చిన్నారెడ్డి అధ్యక్షతన కమిటీ అధ్యయనం




**హైదరాబాద్, జూలై 22 :** వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం కోసం నిపుణుల కమిటీ భేటీ అయ్యింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం, ఉపశమన, అనుసరణ చర్యలను సిఫారసు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వ విద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్ ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని చాలా మంది భావించారని, అయితే జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున సుమారు 30 శాతం వర్షపాత లోటు నమోదైందని, 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 23 జిల్లాల్లో వర్షపాత లోటు ఉందని తెలిపారు.



## ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే నీట్‌పై చర్చ

### రాజ్యసభలో తేల్చి చెప్పిన కాంగ్రెస్ నేత ఖర్గే

**న్యూఢిల్లీ,జూలై22 :** నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తేల్చి చెప్పారు. బుధవారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'నీట్ అంశంపై నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేసేంతవరకు ఎలాంటి చర్చా ఉండదు' అని అన్నారు. దీనిపై లీడర్ ఆఫ్ ది హౌస్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. 'ప్రభుత్వం చర్చకు వెనకడుగు వేయడం లేదు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పుడే చాలా స్పష్టంగా చెప్పారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన అన్ని విషయాలపై కూడా చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాది పారదర్శకమైన ప్రభుత్వం' అని అన్నారు. ÷ఖేంద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు నిరసనలతో సభను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. 'మీరు సభ జరగకుండా అడ్డుకోవాలన్న ఆలోచనతో ఉంటే.. అది కచ్చితంగా మంచి పద్ధతి కాదు' అని అన్నారు.

## ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు

### సోమవారానికి విచారణ వాయిదా వేసిన హైకోర్టు

### రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డిసిపి లావణ్య



**హైదరాబాద్, జూలై 22 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉన్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరఫు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌లో కోరారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అతనిపై అత్తాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బదిలీ అనంతరం డీసీపీ లావణ్య బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని దర్యాప్తు పక్రియను ప్రారంభించారు. కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆమె అకాడమీకి వెళ్లారు. అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో ట్రైనీ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న డిజిటల్, ఇతర ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తీసుకురానుంది. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ విచారణలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చే వాంగ్మూలం కీలక ఆధారంగా మారనుంది. ఈ తాజా పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

## ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అఘాయిత్యం

### క్యాబ్‌ను దారి మళ్లించి అత్యాచారం

### ఫిర్యాదుతో డ్రైవర్ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**హైదరాబాద్, జూలై 22 :** ఒంటరిగా మహిళ కనిపిస్తే చాలు.. అఘాయిత్యానికి ఒడిగడుతున్నారు. తాజాగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఓ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవరే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇప్పుడు సిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఓ ఇండిగో ఎయిర్‌లైన్స్ క్యాబిన్ క్రూ ఉద్యోగినిపై ఓ కామాంధుడు తెగబడ్డాడు. ఆమెను ఎయిర్ పోర్టుకు తీసుకు వెళ్లే క్యాబ్ డ్రైవరే అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రతిరోజూ ఉద్యోగులను డ్యూటీకి తీసుకెళ్లే క్యాబ్ డ్రైవర్‌పై ఆ ఉద్యోగినికి నమ్మకముంది. కానీ తనపై ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా పనిచేస్తున్న బాధితురాలు 20న మధ్యాహ్నం డ్యూటీ కోసం శంషాబాద్ విమానాశ్రయానికి క్యాబ్‌లో బయలుదేరింది. క్యాబ్ డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ మార్గమధ్యంలో వాహనాన్ని దారి మళ్లించాడు. విమానాశ్రయం సమీపంలోని నిర్మాణంలో ఉన్న సాంక్టా మారియా స్కూల్ వద్ద ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ క్యాబ్‌ను ఆపిన నిందితుడు 'టాయిలెట్‌కు వెళ్లి వస్తాను' అంటూ కిందకు దిగాడు. అనంతరం వెనుక సీటు వద్దకు వచ్చి బాధితురాలిపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనతో తీవ్ర షాక్‌కు గురైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు అందుకున్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర కీలక సమాచారంతో నిందితుడు ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు తన నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి కేసు నమోదు చేశామని, నిందితుడిని వేగంగా అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ ఘటనతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగుల రవాణా కోసం ఏర్పాటు చేసే క్యాబ్ సేవల్లో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

**హైదరాబాద్, జూలై 22 :** పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.

## ట్రాన్స్‌కో డీఈ ఇంటిపై ఏసీబీ దాడులు

### భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు

**హైదరాబాద్, జూలై 22 :** హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. గత 12 గంటలుగా కొనసాగుతున్న ఈ తనిఖీల్లో రెండు ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అధికారులు, నగదు, కీలక పత్రాలు, బంగారం, వజ్రాభరణాలు, విదేశీ మద్యం బాటిళ్లతో పాటు కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముత్యం వెంకటరమణ ప్రస్తుతం రెడ్‌కోలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సోదాల్లో ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 ప్లాట్లు, నాలుగు రెసిడెన్షియల్ ప్లాట్లు, కమర్షియల్ భవనాలు, ఖానామెట్ గుట్టల బేగంపేట్‌లో 5 కమర్షియల్ భవనం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2019లో రూ.26 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముత్యం వెంకటరమణపై అప్పటి నుంచే నిఘా కొనసాగుతోందని, విద్యుత్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.

జనం వార్త

# ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు!




**తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే.. పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు.**

కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు.

విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు.

నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు. ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

# ప్రధాని ఇంటిముందు ధర్నాకు
# కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

- ఖర్గే నివాసానికి వెళ్లి.. గుట్టుచప్పుడు కాకుండా ధర్నా
- పోలీసులను ఆయోమయంలోకి నెట్టిన కాంగ్రెస్ తీరు



**న్యూఢిల్లీ, జులై 22 :** ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని మోదీ నివాసం ముందు మంగళవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టిన విషయం పక్కా ప్లాన్‌తో చేపట్టినట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీకేజీతో పాటు సీజేపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ అంశంలో ఆ ధర్నా నిర్వహించారు. అయితే కట్టుదిట్టమైన లోక్ కళ్యాణ్ మార్గ్ కు కాంగ్రెస్ నేతలు అంతా ఎలా వెళ్లారని ఢిల్లీ పోలీసులు ఇప్పుడు ఆరా తీసే పనిలో పడ్డారు. వాస్తవానికి మంగళవారం కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఖర్గే ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజాజి మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నివాసం ఉన్నది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్ తో పాటు అనేక మంది ఎంపీలు తొలుత మల్లిఖార్జున్ ఖర్గే ఇంటికి వెళ్లారు. ఖర్గేకు 84వ పుట్టిన రోజు విషెస్ తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు అకస్మాత్తుగా మరో ప్లాన్ వేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని ఇంటి వైపు ర్యాలీ తీశారు. ఖర్గే ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే ప్రధాని మోదీ నివాసం ఉన్నది. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ఎంపీలు .. ప్రధాని మోదీ గేటు ముందు చేరుకున్నారు. అక్కడే మెరుపు దాడికి దిగారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ఘటనతో షాక్ అయ్యారు. సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ప్రాంతంలోకి ఒకేసారి ఇంత మంది ఎలా వచ్చారని పోలీసులు ఆలోచిస్తున్నారు. అయితే ఖర్గే పుట్టినరోజు కావడం వల్ల ఆ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉదయం నుంచే జనం ఉన్నారని, రాజాజి మార్గ్‌లో అనేక వాహనాలను కూడా పార్క్ చేసినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 7 లోక్ కళ్యాణ్ మార్గ్ లొకేషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ధర్నాకు దిగడం పట్ల ఢిల్లీ పోలీసులు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియదు. కానీ ఢిల్లీ పోలీసులు మాత్రం సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు అంగీకరిస్తున్నారు. ఖర్గే ఇంటికి చేరిన కాంగ్రెస్ నేతలు.. పార్లమెంట్ సమీపంలో ఉన్న విజయ్ చౌక్‌కు ర్యాలీ తీస్తారని భావించినట్లు కొందరు పోలీసులు చెప్పారు.

# చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం

### అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ



**న్యూఢిల్లీ, జులై 22 :** కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.




## మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

**విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ**

**నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన**

**న్యూఢిల్లీ, జులై 22 :** వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

# ఇరాన్ చూసింది ట్రైలర్ మాత్రమే..
# సినిమా ముందుంది: ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఇప్పట్లో ఆ దేశాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలో ఉన్న పికాక్స్ పర్వతంపై భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. వాటి కింద ఉన్న రహస్య భూగర్భం లో ఆ దేశం అణు కార్యక్రమాలు తిరిగి ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. మళ్లీ అణ్వాయుధాలను తయారు చేయకుండా ఆపడానికి దానిని పూర్తిగా నాశనం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇరాన్‌పై జరిగిన దాడులు కేవలం ట్రైలర్ మాత్రమే అని.. త్వరలో సినిమా చూపిస్తామంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద దాదాపు 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. దానితో పికాక్స్ పర్వతం కింద తన అణు కార్యక్రమాన్ని చేపట్టడానికి ఆ దేశం చర్యలు తీసుకుంటున్నట్లు తమవద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. దానిని ధ్వంసం చేసి.. యురేనియం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడానికి త్వరలో సైనిక చర్య చేపడతామన్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో తీవ్ర విధ్వంసం తప్పదని హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగిస్తోంది. రాజధాని టెహ్రాన్ సహా దేశంలోని పలు నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సెంటర్లు, డ్రోన్ స్టోరేజీ సైట్లు, పలు పౌర నివాసాలపై అమెరికా బాంబు దాడులు చేసినట్లు తెలిపారు. చాబహార్ పోర్టుపై అగ్రరాజ్యం మళ్లీ క్షిపణులతో విరుచుకుపడింది. మరోవైపు అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఖతార్, కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది.

**మునీర్‌కు మొజ్తబా ఖమేనీ రహస్య సందేశం..**

అమెరికా–ఇరాన్ శాంతి చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఇరాన్ మంత్రి మొమేనీ.. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో 50 నిమిషాలపాటు రావల్పిండిలో భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం మొజ్తబా ఖమేనీ పంపిన రహస్య సందేశాన్ని ఆయన మునీర్‌కు అందించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

**యుద్ధం ఖర్చు 37.5 బిలియన్ డాలర్లు: అమెరికా**

ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఖర్చు దాదాపు 37.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.6లక్షల కోట్లు) అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. ఇందులో సెప్టెంబర్ 30 వరకు అయ్యే ఖర్చు అంచనా వ్యయాలు కూడా ఉన్నాయన్నారు. పెంటగాన్‌కు సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కావాలన్న అభ్యర్థన నేపథ్యంలో రక్షణమంత్రి ఈ వివరాలు వెల్లడించారు.



## వాంగ్‌చుక్‌కు మద్దతుగా అమెరికాలో నిరసన

**న్యూయార్క్ :** విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు అమెరికాలోనూ మద్దతు లభిస్తోంది. న్యూయార్క్, శాన్‌జోస్ నగరాల్లో "హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్" సంస్థ కార్యకర్తలు నిరసన చేపట్టారు. వాంగ్‌చుక్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని కోరారు. లండన్‌లోని భారత హైకమిషన్, డబ్లిన్‌లోని రాయబార కార్యాలయం ఎదుట కూడా నిరసనలు జరిగాయని సంస్థ వెల్లడించింది. 20 రోజులకు పైగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో శనివారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

# ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నం

**హైదరాబాద్:** శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఇండిగో ఉద్యోగిని రోజు మాదిరిగానే రాత్రి విధులకు క్యాబ్‌లో ఇంటి నుంచి బయల్దేరారు. క్యాబ్ డ్రైవర్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలోకి కారును మళ్లించి అత్యాచారయత్నం చేశాడు. ఉద్యోగిని తీవ్రంగా ప్రతిఘటించడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై బాధితురాలు శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అధికారులు ఉద్యోగుల రవాణా, భద్రతపై సమీక్ష నిర్వహించారు.





## స్మశానవాటిక స్థలం కేటాయించాలి

**బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్**

**శేరిలింగంపల్లి, జూలై 22 (జనం వార్త) :** స్మశానవాటికగా కొనసాగుతున్న స్థలాన్ని దానికే కేటాయించాలని, మియపూర్ మక్త మహబూబ్ పెట్ బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్ అన్నారు. బుధవారం స్థానిక మక్త ప్రాంతానికి చెందిన మహిళ చనిపోగా, స్మశానవాటికలో ఖననం చేయడానికి వెళ్లిన వారిని అక్కడి వారు అడ్డుకున్నారని తెలుసుకున్న స్థానిక నాయకుడు కొంచె శివరాజ్ ఘటనాస్థలికి చేరుకొని, శేరిలింగంపల్లి తహశీల్దార్‌తో మాట్లాడి, సామరస్యంగా మృతురాలి ఖననం చేపించి తాత్కాలిక సమస్యని పరిష్కరించచారు. స్థానిక సమస్యలపై ఎమ్మార్వో సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని కొంచె శివరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ మహిళా నాయకులు రోజా,కిరణ్, కాసాని శ్రీధర్,కొంచ ప్రభాకర్,గోపరాజు శ్రీనివాస్,ఫారనంది నర్సింగరావు,గుండె రాజు,సుధాకర్ రాజు, మల్లన్న,చిన్న పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## సీఎంసీ టౌన్ ప్లానింగ్‌లో భారీ బదిలీలు

**16 మందికి కొత్త పోస్టింగ్‌లు.. తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు**

**శేరిలింగంపల్లి, జూలై 22(జనం వార్త):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) టౌన్ ప్లానింగ్ విభాగంలో పరిపాలనా అవసరాల దృష్ట్యా భారీ స్థాయిలో బదిలీలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న 16 మంది చైన్‌మెన్లు, వార్డు అధికారులకు కొత్త పోస్టింగ్‌లు ఇస్తూ కమిషనర్ జి. సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు తక్షణ ప్రభావంతో అమల్లోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమ ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ అయి, కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. ఉత్తర్వుల ప్రకారం ఎల్. లచ్చయ్యను సర్కిల్-46 నుంచి సర్కిల్-47 (అమీన్‌పూర్)కు, లింగంను సర్కిల్-48 నుంచి సర్కిల్-53 (మూసాపేట్)కు, కరణ్‌ను సర్కిల్-48 నుంచి సర్కిల్-45 (నర్సింగి)కి, పి. కుమారస్వామిని సర్కిల్-50 నుంచి సర్కిల్-49 (శేరిలింగంపల్లి)కి, సి. నాగయ్యను సర్కిల్-52 నుంచి సర్కిల్-51 (ఆల్విన్ కాలనీ)కి, ఎం. మోహన్‌ను సర్కిల్-53 నుంచి సర్కిల్-54 (చింతల్)కు బదిలీ చేశారు. అదేవిధంగా మల్లేశ్‌ను సర్కిల్-54 నుంచి సర్కిల్-50 (మాదాపూర్)కు, డి. ఐలయ్యను సర్కిల్-55 నుంచి సర్కిల్-52 (కూకట్‌పల్లి)కు, ఎం. రఫత్‌ను సర్కిల్-55 నుంచి సర్కిల్-59 (దుండిగల్)కు, రజియుద్దీన్‌ను సర్కిల్-57 నుంచి సర్కిల్-56 (కొంపల్లి)కు, హరీష్ కుమార్‌ను సర్కిల్-58 నుంచి సర్కిల్-60 (మెడ్చల్)కు బదిలీ చేస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు. వార్డు అధికారుల విభాగంలో కూడా మార్పులు చేపట్టారు. శ్రీకాంత్ నాయక్‌ను సర్కిల్-58 నుంచి సర్కిల్-57 (జవహర్‌నగర్)కు, శ్రీకాంత్ గౌడ్‌ను సర్కిల్-58 నుంచి సర్కిల్-55 (జీడిమెట్ల)కు, వెంకటరావును సర్కిల్-58 నుంచి సర్కిల్-48 (మియాపూర్)కు, డి. మధును సర్కిల్-60 నుంచి సర్కిల్-58 (నిజాంపేట్)కు బదిలీ చేశారు. అలాగే మోహన్‌ను సర్కిల్-49 నుంచి సర్కిల్-46 (పటాన్‌చెరు)కు నియమించారు. బదిలీ ఉత్తర్వుల అమలుపై కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని సూచించారు. అలాగే సంబంధిత డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయిన సిబ్బందిని వెంటనే రిలీవ్ చేసి, వారు కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త స్థానాల్లో అధికారులు విధుల్లో చేరిన విషయాన్ని ధృవీకరించి నివేదిక సమర్పించాలని కూడా సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒకేసారి 16 మంది సిబ్బందికి బదిలీలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనా సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చడం, సేవల నిర్వహణలో వేగం పెంచడం లక్ష్యంగానే ఈ బదిలీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : ఏసిపి రవీందర్‌రెడ్డి

**దుబ్బాక పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటిన పోలీసులు**

**దుబ్బాక,జూలై 22(జనం వార్త) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సిద్దిపేట ఎసిపి రవీందర్ రెడ్డి అన్నారు. దుబ్బాక పోలీస్ స్టేషన్ లో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొక్కలు మానవ జీవితానికి ప్రాణాధారమని అన్నారు. వర్షపాతం పెరగడం, భూసారం పరిరక్షణ, ఉష్ణోగ్రతల నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణలో మొక్కల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సీఐ రాజేష్,దుబ్బాక ఎస్సై కీర్తిరాజు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన డివిజన్ అధ్యక్షులు భూమయ్య యాదవ్

**నాగారం, జూలై 22 (జనం వార్త) :** రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నాగారం డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలసాని భూమయ్య యాదవ్ పరిశీలించారు. బుధవారం నాగారం, రాంపల్లి వివిధ వార్డు కార్యాలయాలకు వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి ప్రజలకు ఓటర్ సవరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సార్" ప్రక్రియను





వేగవంతం చేయాలని బిఎల్ఓకు సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, ఈగ శ్వేత,డివిజన్ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, గూడూరు అశోక్ గౌడ్, బండారి మల్లేష్, సురేష్, కొండల్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,గండి శ్రీశైలంగౌడ్,పంబల్ల బలరాం,కాంటెకర్ నరేందర్,గండిపల్లి అశోక్,గండి శ్రీధర్ గౌడ్, బాల నరసింహ,రేగు అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టించడానికే కాంగ్రెస్ ప్రయత్నం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్**

**దుబ్బాక,జూలై 22(జనం వార్త) :** విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షులు గొల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అంబటి బాలేష్ గౌడ్ మాట్లాడుతూ ఒకపక్క పార్లమెంటు సమావేశాలు జరుగుచుండగా ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్లమెంటులో చర్చలో పాల్గొనకుండా దేశంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని పెంచే ప్రధాని





నరేంద్ర మోడీ ప్రతిష్టకు, భారతదేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా దేశంలో అంతర్గతంగా అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ కొంతమంది దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విభేదాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగబద్ధమైన దేశ ప్రతిష్ఠ,సామాజిక శాంతి, ప్రజల ఐక్యతకు నష్టం కలిగించే చర్యలు ఏ లక్ష్యంతో జరిగినా సమర్థించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సుంకోజు ప్రవీణ్, అంబటి శివప్రసాద్,గాజుల భాస్కర్,పోగుల భూపాల్,గవ్వల రమేష్, రమేష్ రెడ్డి,రమణారెడ్డి, కిషన్ నేహాల్ గౌడ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఒక్క ఓటరు కూడా మిగలొద్దు

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి
- 83.03% ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి
- పెండింగ్ ప్రక్రియను త్వరగా ముగించాలని కలెక్టర్ ఆదేశం



**ములుగు, జూలై 22 :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 25 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తున్నారని, జిల్లాలో ఇప్పటివరకు 83.03 శాతం ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందనిష్ట తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్లను మరోసారి సంప్రదించి ఫారాల సేకరణ, డిజిటైజేషన్‌నుస్త్ర వేగవంతం చేయాలని, బీఎల్‌వో యాప్ ద్వారా వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే రీ-విజిట్ నిర్వహించి అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడాజ మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 10 నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమవుతుందని, ఓటర్ల పేర్ల చేర్పు, సవరణలు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, డీడబ్ల్యూఓ ప్రేమలత, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు కచ్చితంగా అమలు చేయాలి



- 1/70, పెసా, ఎల్‌టీఆర్ చట్టాల అమలుకు స్పెషల్ మానిటర్‌కు వినతిపత్రం
- గిరిజన భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంఘాల డిమాండ్
- గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని మన్యసీమ పరిరక్షణ సమితి విజ్ఞప్తి

**ములుగు, జూలై 22, :** షెడ్యూల్డ్ ఏరియా, ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70, పెసా, ఎల్‌టీఆర్ గిరిజన చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేసి గిరిజన హక్కులను పరిరక్షించాలని మన్యసీమ పరిరక్షణ సమితి (డోలు దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏటూరునాగారం ఐటీడీఏ పీఓఎం అతిథి గృహంలో నేషనల్ ఉమెన్ రైట్స్ కమిషన్ స్పెషల్ మానిటర్ (ట్రైబల్ హెల్పర్) ఆర్. హేమంత్ కుమార్ను కలిసి ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గొప్ప వీరయ్య మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీవో నెం. 3ను పునరుద్ధరించాలని, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో 1/70, పెసా, ఎల్‌టీఆర్ చట్టాలను కఠినంగా అమలు చేసి గిరిజనుల భూములు, హక్కులను రక్షించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు పొదెం కృష్ణప్రసాద్, పులసం పురుషోత్తం, ఈసం యాదయ్య, ఈసం రాజు తదితరులు పాల్గొన్నారు.



## నీటి సంక్షోభంపై ఖమ్మంలో హై అలర్ట్

- వరి, మిర్చికి బ్రేక్ - ప్రత్యామ్నాయ పంటలే భవిష్యత్ : మంత్రి తుమ్మల
- వచ్చే జూన్ వరకు తాగునీటిని కాపాడే కార్యాచరణ సిద్ధం
- గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం
- రూ.1.75 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన
- అభివృద్ధి-నీటి సంరక్షణకు సమాంతర కార్యాచరణ

**ఖమ్మం, జూలై 22:** నీటి కొరత ముప్పు నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో వ్యవసాయ విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. రాబోయే కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్తో కలిసి వి. వెంకటాయ-పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించిన మంత్రి, అనంతరం అధికారులు, ఇంజినీర్లతో నీటి లభ్యత, తాగునీటి సంరక్షణ, గోదావరి జలాల మళ్లింపుపై సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నందున ప్రతి నీటి బొట్టును అత్యంత జాగ్రత్తగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం కారణంగా భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, రైతులు ఇప్పటికైనా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తీసుకురావాలన్న చిరకాల కల ఇప్పుడు సాకారమవుతోందని పేర్కొన్న మంత్రి, రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి వైరా వైపు వెళ్లిన గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోందని వెల్లడించారు. మంచుకొండ ఎత్తిపోతల వ్యవస్థ ద్వారా చెరువులు నింపి, మున్నేరు ద్వారా ఖమ్మం నగర తాగునీటి అవసరాలను తీర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రూ. 90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఈ ప్రాజెక్టు విజయవంతానికి కృషి చేసిన ఇంజినీర్లను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, వచ్చే జూన్-2027 వరకు తాగునీటి అవసరాలు తీరేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుతం గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించే అవకాశాలను ఇంజినీర్లు పరిశీలిస్తున్నారని, ఈ ప్రయోగం విజయవంతమైతే ఖమ్మం నగర తాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ. 1.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



## ఖమ్మంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన

- రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం
- కాంగ్రెస్ వైఖరిని ఖండించిన బీజేపీ నాయకులు..
- ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన ప్రదర్శన
- నీట్, పార్లమెంట్ వ్యవహారాలు, నిరసన రాజకీయాలపై కాంగ్రెస్‌పై విమర్శలు
- బాధ్యతాయుత వైఖరి అవలంబించాలని డిమాండ్

**ఖమ్మం, జూలై 22:** దేశ భద్రత, జాతీయ రాజకీయాల అంశాలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా శాఖ బుధవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వరంగల్ ప్రభారీ, మాజీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి మరియు జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో కాంగ్రెస్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చలకు దూరంగా ఉండి, వీధి నిరసనలకు ప్రాధాన్యం ఇవ్వడం సరైన విధానం కాదని విమర్శించారు. నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ స్పందించలేదని వారు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల సందర్భంగా చట్టవ్యవస్థ పరిరక్షణ కోసం పోలీసులు తీసుకున్న చర్యలను సమర్థించిన నాయకులు, ప్రజా ఆస్తులు, శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని బీజేపీ నాయకులు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని, ప్రజల సంక్షేమం దిశగా పనిచేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రుద్ర ప్రదీప్, దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, అలాగే బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా

**నిధులకు కొరత ఉన్నా, అభివృద్ధిలో వెనకడుగు లేదు**

**నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో లోకేశ్**

**గుంటూరు, జులై 22 :** మంగళగిరి నియోజకవర్గంలో రెండో రోజు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. 'మన ఇల్లు – మన లోకేశ్' పేరిట మంత్రి నారా లోకేశ్.. ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. రెండు రోజుల్లో 3,000 మందికి పట్టాలను పంపిణీ చేయనున్నారు. కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో ఇల్లు నిర్మించుకొని దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్నారు. దీంతో అర్హులైన పేద కుటుంబాలకు మంత్రి బట్టలు పెట్టి.. పసుపు, కుంకుమలతో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నా మంగళగిరిలో అభివృద్ధి ఆగట్లేదని తెలిపారు. మంగళగిరి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కూడా గొడవ పెట్టుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో ఇబ్బంది ఉంటే సీఎస్సార్ నిధులు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా పారదర్శకంగా ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బొట్టు పెట్టి ఇళ్ల పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. దేశం మొత్తం నిడమర్రు పాఠశాల గురించి మాట్లాడుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటి పట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజీ, 100 పడకల ఆసుపత్రి, నీటి సమస్య.. ఇలా అన్నింటికీ రెండేళ్లలోనే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మంగళగిరి ప్రజలు ఓడించారనే కసితో ఇంకా బాగా పనిచేశానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షంలో ఉ ఒడగా 29 సంక్షేమ పథకాలను సొంత నిధులతో అమలు చేసి.. అధికారం ఇస్తే ఇంకెలా చేస్తానో అనే భరోసా కల్పించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## పిల్లలను చదివించే ప్రతి తల్లికి వందనం

**తల్లికి వందనం నిధుల విడుదలపై లోకేశ్**

**అమరావతి, జులై 22 :** రాష్ట్రవ్యాప్తంగా 'తల్లికి వందనం' నిధులను కూటమి ప్రభుత్వం బుధవారం విడుదలకు రంగం సిద్ధం చేసింది. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు జమ చేయనుంది. తల్లికి వందనం నిధుల విడుదల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఏ ఒక్క చిన్నారీ విద్యకు దూరం కాకూడదనేది కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. 'పిల్లలే మన సంపద. వారి చదువులే మనకు తరగని ఆస్తి. విద్యే మన రాష్ట్రానికి వెలకట్టలేని పెట్టుబడి' అని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇచ్చేలా తల్లికి వందనం పథకాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం నిధులను విద్యా సంవత్సరం ఆరంభంలోనే విడుదల చేశామన్నారు. తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. 42.70 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు జమ చేస్తున్నామన్నారు. నేటి నుంచి ఈనెల 24 వరకు ఈ పక్రియ కొనసాగుతుందని తెలిపారు. 'పిల్లలను చదివించే ప్రతి తల్లికీ నా వందనం' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

## కర్నూలులో పికిల్ బాల్ కోర్టు ప్రారంభం

**రూ.2.5 కోట్లతో సింథటిక్ వాకింగ్ ట్రాక్ : భరత్**

**కర్నూలు, జులై 22 :** అవుట్ డోర్ స్టేడియంలో రూ.2.5 కోట్లతో సింథటిక్ వాకింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్ నిర్మిస్తున్నామని మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. క్రీడాకారుల కోసం ప్రపంచస్థాయి ప్రమాణాలతో సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో పికిల్ బాల్ కోర్టును మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అవుట్ డోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు సమకూర్చి ఈ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఏపీలో క్రీడలపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.

## విజయవాడ బిజెపి ర్యాలీలో ఉద్రిక్తత

**విజయవాడ, జులై 22 :** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆ పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. విజయ టాకీస్ నుంచి ర్యాలీగా భాజపా కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌కు చేరుకుని ప్రతిపక్షనేత రాహుల్, ప్రియాంకకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందుకు.. ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇర పార్టీల కార్యకర్తలు జెండా కర్రలు, నీళ్ల బాటిళ్లు, చెప్పులతో పరస్పరం దాడులకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి అదుపు చేశారు. ఈ ఘటనతో విజయవాడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## ఏనుగుల గుంపు రాకతో రైతుల్లో ఆందోళన

**విజయనగరం, జులై 22 :** విజయనగరం జిల్లా బాడంగి మండలం రేజేరు గ్రామ సమీపంలో రేవడి చెరువు, నల్లోడు పొలాల్లో ఏనుగుల గుంపు బుధవారం ఉ దయం సంచరించింది. బాడంగి మండలం పినపెంకి వైపు మార్గం మళ్లించాయి. గత వారం రోజులుగా తెర్లాం, బాడంగి పరిసర ప్రాంతాల్లో ఏనుగులు స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మొక్కజొన్న, పశువులు గడ్డి, వరి నారుమడుల్లో సంచరిస్తూ పంట నష్టం కలిగిస్తున్నాయి. ఏనుగుల సంచారంతో పంటపొలాలు నష్టమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

**ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు**

**సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ**

**పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు**

**గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు**



**న్యూఢిల్లీ, జూలై 22 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమ య్యారు. ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి – కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి – కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.

## ఐదేళ్లపాటు అమరావతికి బ్రేక్

**జగన్ తీరుతో నిలిచిపోయిన పనులు**

**మంత్రి నారాయణ వెల్లడి**



**గుంటూరు, జులై 22 :** అమరావతి రైల్వే లైన్, ఇన్నర్ రింగు రోడ్డు, రాజధాని రేడియల్ రోడ్లకు భూ సమీకరణకు సంబంధించి తాడికొండలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2015లో భూ సమీకరణ మొదలైనా.. పనులు మాత్రం 2018లో మొదలయ్యాయని తెలిపారు. జగన్ హయాంలో ఐదేళ్లు పనులు జరగలేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. నిర్మాణాలు పూర్తైన భవనాలను అతి త్వరలోనే వినియోగంలోకి తెస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రైల్వే లైన్, రింగు రోడ్డు కోసం భూములు అవసరమని, రైతులు త్వరగా భూ సమీకరణకు వస్తే పనులు చేపడతామని చెప్పారు. తాడికొండ నుంచి రాజధాని వెళ్లే రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. తాడికొండ, కంతేరు, మోతడక, కొప్పురావూరు గ్రామాల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ వెళ్తుందని మంత్రి తెలిపారు. ల్యాండ్ అక్విజిషన్‌కు వెళ్లాలా లేక పూలింగ్‌కు వెళ్లాలా అనే దానిపై రైతుల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. గ్రామసభలో మెజారిటీ రైతులు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకారం తెలిపారని చెప్పారు. 50 ఎకరాల భూమికి రైతులు ఇప్పటికే పత్రాలు సమర్పించారని.. వారి సందేహాలన్నింటికీ ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. రైతులకు అనువైన చోటే రిటర్న్ ఎలాట్లు ఇస్తామని వెల్లడించారు. రెండు, మూడు లేఅవుట్ డిజైన్లు చూపించి రైతుల అభిప్రాయం మేరకు ఎలాట్లు కేటాయిస్తామన్నారు. 2027 మార్చి నాటికి 350 కి.మీ ట్రంక్ రోడ్లు పూర్తవుతాయని, 2027 చివరి నాటికి అమరావతి లేఅవుట్లు పూర్తి చేస్తామని నారాయణ ప్రకటించారు. ఈ నెల 25న ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను ప్రభుత్వానికి అప్పగిస్తామని, వచ్చే నెల 15న ఎమ్మెల్సీ క్వార్టర్స్, సెప్టెంబర్ మొదటి వారంలో మంత్రుల నివాసాలను అప్పగిస్తామన్నారు. ప్రతి 15 రోజులకు సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తున్నారని, అమరావతి పనులపై ప్రతిరోజూ తాను కూడా సమీక్ష చేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ పూలింగ్ వేగంగా పూర్తైతే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. రైల్వే శాఖ.. పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ వెంట సర్వీస్ రోడ్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు త్వరగా భూములు ఇస్తే అంతే త్వరగా ఎలాట్లు కేటాయిస్తామన్నారు. అమరావతి అభివృద్ధిలో రైతుల సహకారం కీలకమని తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు సహకరించిన రైతులకు మంత్రి నారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## ఆ హామీ ఇస్తే.. దీక్ష విరమిస్తా

**పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్**

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దోషులను శిక్షించాలంటూ సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు మద్దతుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఆయన.. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు లేఖ రాశారు. ఆందోళనల్లో పాల్గొన్న యువతపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇస్తే దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. ఆందోళన విరమించి ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిరసనకారులను కూడా కోరతానన్నారు. "కేంద్ర మంత్రులు ఆసుపత్రికి వచ్చి నన్ను పరామర్శించి, దీక్ష విరమించాలని కోరినందుకు ధన్యవాదాలు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అవసరమైన పరిహారం ఇవ్వడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా అంశాన్ని పరిశీలించడంతో పాటు పార్లమెంటులో దీనిపై చర్చ జరపాలన్న విజ్ఞప్తికి మీరు సానుకూలంగా స్పందించారు. మీ తర్వాత.. దీక్ష విరమించాలని కోరుతూ వివిధ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు నాకు లేఖ రాశారు. వారితో నేను ఏకీభవించాను" అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. "నేను కూడా జీవించాలని అనుకుంటున్నా. విద్యార్థుల కోసం ఎంతో చేయాల్సి ఉంది. అయితే, ఈ ఉ ద్యమం ఎవరికోసమైతే మొదలైందో, వారి జీవితాలను పణంగా పెట్టి అలా చేయలేను. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారిపై ఎటువంటి చర్యలు, చట్టపరమైన కేసులు, వేధింపులు ఉండవని హామీ ఇస్తే దీక్షను విరమిస్తా. లేదంటే నిరవధిక దీక్షను కొనసాగించాల్సి వస్తుంది. నిరసనకారులపై ఇకపై పోలీసు బలప్రయోగం ఉండదని ఆశిస్తున్నా" అని వెల్లడించారు.

## రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

**హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ**

**కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి**



**హన్మకొండ, జూలై 22 :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.



## జనరిక్ ఔషధాలపై ట్రంప్ కీలక ప్రకటన..

**వాషింగ్టన్ :** జనరిక్ ఔషధాల దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఆగస్టు 1 నుంచి జనరిక్ ఔషధాలపై సుంకాలు ఉ ఒడబోవని ప్రకటించారు. అమెరికాలోకి దిగుమతి అయ్యే అన్ని జనరిక్ ఔషధాలకు సున్నా శాతం సుంకం వర్తిస్తుందని.. రెండేళ్ల పాటు (ఆగస్టు 2028 వరకు) ఇది అమలులో ఉంటుందని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. మూడో ఏడాదిలో 100 శాతం సుంకాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో ఏడాది నుంచి ఈ సుంకాలు 200 శాతానికి పెంచనున్నట్లు చెప్పారు. తొలి రెండేళ్లలో జనరిక్ ఔషధాలు ఉత్పత్తి చేసే కంపెనీలు అమెరికాలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఔషధాలను దేశీయంగానే ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా ట్రంప్ వెల్లడించారు.

# వచ్చే ఏడాది స్మార్ట్‌ఫోన్ల ధరలు మరింత పైకి




మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు కారణంగా గ్లోబల్ టెక్ కంపెనీలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాదిలో వీటి ధరలను 10 శాతం మేర పెంచే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీంతో రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఏఐ పరికరాల ధరలు ఆకాశన్ని తాకుతాయనడంలో సందేహం లేదు. 6 ఎన్‌ఎం కంటే తక్కువ ఉండే చిప్‌లతో పాటు 28ఎన్‌ఎం, 16ఎన్‌ఎం, 12ఎన్‌ఎం చిప్‌లు ధరలూ పెరగనున్నాయి. దీంతో వచ్చే ఏడాది కూడా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ధరలకు రెక్కలొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



## బిజినెస్



## భగ్గుమన్న చమురు ధరలు

### మళ్లీ 95 డాలర్ల పైకి

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ మళ్లీ 95 డాలర్లు దాటింది. గడిచిన ఆరు వారాల్లో ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. అటు వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియేట్ రకం కూడా 88 డాలర్ల స్థాయికి చేరింది. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా తన వైమానిక దాడులు కొనసాగిస్తుండడం.. ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికితోడు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో ఆయిల్ ట్యాంకర్లు తమ మార్గాలను మార్చుకుంటున్నాయి. దీంతో పశ్చిమాసియాలో ముడి చమురు రవాణాకు మరోసారి అంతరాయం ఏర్పడడంతో పాటు ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే మన మార్కెట్ సూచీలు నేడు భారీగా పతనమయ్యాయి.




## మూడో రోజూ నష్టాల్లో సూచీలు

### మళ్లీ 24 వేల దిగువకు నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ 24 వేల మార్కు దిగువకు చేరింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో కలిపి సెన్సెక్స్ 1400, నిఫ్టీ 300 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 77,384.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,470.11) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆపై మరింత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,641.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 715.06 పాయింట్ల నష్టంతో 76,755.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 191.45 పాయింట్ల నష్టంతో 23,996.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 4117.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## అన్‌క్లెయిమ్డ్ నిధులు ఇతర అవసరాలకు వాడబోం: కేంద్రం

ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్‌వోలో ఎవరూ క్లెయిమ్ చేయని నిధులకు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఆ ఖాతాల్లోని సొమ్మును ఇతర అవసరాలకు వినియోగించే ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఐఆర్‌డీఏఐ నిబంధనల ప్రకారం.. 10 ఏళ్లకు పైగా క్లెయిమ్ చేయకుండా ఉన్న బీమా నిధులను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫండ్ (ఎస్‌సీడబ్ల్యూఎఫ్)కు బదిలీ చేయాల్సి ఉంటుందని పంకజ్ చౌదరి తెలిపారు. వాటిని ఇతర అవసరాలకు వినియోగించుకునే ఉద్దేశమేదీ లేదన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఎల్‌ఐసీలో రూ.7,318.50 కోట్ల అన్‌క్లెయిమ్డ్ నిధులు ఉన్నాయని చెప్పారు. ఇందులో రూ.5,564.55 కోట్లు పాలసీదారుల అసలు కాగా, రూ.1,753.95 కోట్లు ఆ నిధులపై వచ్చిన వడ్డీ మొత్తం ఉందని వివరించారు. ఇక ఈపీఎఫ్ఓ ఖాతాల్లో రూ.9,330.56 కోట్ల అన్‌క్లెయిమ్డ్ నిధులు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఎవరూ క్లెయిమ్ చేయని మొత్తాలను నామినీలకు చేర వేసేలా ఎల్‌ఐసీ, ఈపీఎఫ్ఓ తమ వంతు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈపీఎఫ్‌వోలో రూ.వెయ్యి లేదా అంతకంటే తక్కువ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్న ఆధార్ వెరిఫైడ్ ఖాతాల్లోకి నేరుగా నిధులను బదిలీ చేసేలా పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. ఇందుకు ఎలాంటి డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేయడం లేదని చెప్పారు. 'నిధి ఆప్‌కే నికత్' క్యాంపులు, సామాజిక మాధ్యమాలు, అధికారిక వెబ్‌సైట్, ఉత్తరాలు, లోకల్ ఏజెంట్లు, బీమా సఖిలు, క్రెడిట్ బ్యూరో ఏజెంట్ల ద్వారా పాలసీదారులను, నామినీలను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

## బంగారానికి మళ్లీ రెక్కలు..

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు, ద్రవ్యోల్బణ భయాలతో ఈ లోహాలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ విపణిలో బుధవారం ఉదయం 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,49,400కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2వేలు పెరగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.32లక్షలు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.06శాతం పెరిగి రూ.1.44లక్షలుగా కొనసాగుతోంది. వెండి సెప్టెంబరు ఫ్యూచర్స్ ధర కూడా ఒక శాతం పెరిగి రూ.2.26లక్షలుగా కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పుత్తడి ధర 4,129 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర 60 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతోంది. ఇరాన్‌తో ఇప్పట్లో చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఫలితంగా ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో బంగారం, వెండిలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ ఏర్పడింది.



## రికార్డులు సృష్టించిన ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్

దాదాపు 16 స్టేడియాలు ఆతిథ్యం ఇచ్చిన ఫిఫా ప్రపంచ కప్ విజేతగా స్పెయిన్ నిలిచింది. ఫైనల్‌లో అర్జెంటీనాను చిత్తు చేసింది. ఆటగాళ్ల రవాణా అంశం నుంచి.. ఒకే జట్టుకు పక్షపాతంగా వ్యవహరించారంటూ ఫిఫాపై ఆరోపణల వరకూ వరల్డ్ కప్ ప్రతి రోజూ వార్తల్లో నిలిచింది. దాదాపు ఆరువారాలపాటు నిర్విరామంగా మ్యాచులతో అభిమానులను అలరించింది. ఛాంపియన్‌గా నిలిచిన స్పెయిన్ దాదాపు రూ.480 కోట్ల ప్రైజ్‌మనీ అందుకుంది. ఇటు వీక్షణలపరంగానూ ఫైనల్ మ్యాచ్ రికార్డులు సృష్టించింది. స్పెయిన్ – అర్జెంటీనా పోరును దాదాపు 3.89 కోట్ల మంది వీక్షించినట్లు ఫాక్స్ గ్రూప్ తెలిపింది. ఒక దశలో 5.16 కోట్ల మార్క్‌ను చేరినట్లు పేర్కొంది. యూఎస్ చరిత్రలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో అత్యధిక మంది వీక్షించిన మ్యాచ్‌గా రికార్డు సృష్టించింది. మరోవైపు ప్రముఖ బ్రాడ్‌కాస్ట్ 'టెలెముండోస్' కూడా తమ ఛానళ్లలో 2.26 కోట్ల మంది చూసినట్లు వెల్లడించింది. దీంతో అమెరికాలోనే 6 కోట్ల మందికిపైగా వ్యూయర్స్ మ్యాచ్‌ను వీక్షించినట్లు తెలుస్తోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా అయితే 150 కోట్ల మంది వరకూ ఫైనల్‌ను చూసినట్లు నిపుణులు అంచనా వేశారు. అయితే.. ఇవి అధికారికంగా రిలీజ్ చేసిన గణాంకాలు కావు. ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌నకు ఆతిథ్యం ఇచ్చిన అమెరికా, మెక్సికో, కెనడా నాకౌట్ స్టేజ్‌లో నిష్క్రమించాయి. అయినా సరే అమెరికాతో సహా ఇతర దేశాల్లో ఫుట్‌బాల్ మ్యాచులను అభిమానులు భారీగానే వీక్షించారు. మెస్సి, క్లియాన్ ఎంబాపె, ఇర్లింగ్ హాలాండ్, క్రిస్టియానో రొనాల్డో వంటి స్టార్ల ఆటను చూసేందుకు ఆసక్తి చూపించారు. యువ సంచలనం యమాల్‌తో మెస్సి పోరు ఎలా ఉంటుందోనని ఫ్యాన్లకు అతుక్కుపోయారు. మరోవైపు టికెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో.. టీవీల్లో వీక్షించేవారి సంఖ్య పెరిగింది. ఈ సందర్భంగా వరల్డ్ కప్‌ను నిర్వహించిన ఆతిథ్య దేశాలపై ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ప్రశంసల వర్షం కురిపించారు.



## గత నాలుగు నెలల్లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా

### : వైభవ్ సూర్యవంశీ

ఇటీవల కాలంలో తాను ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్నట్లు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం సిద్ధమవుతోన్న అతడు బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. క్రికెటర్ కెరీర్‌లో ఇవన్నీ సహజమేనని.. వాటన్నింటిని అధిగమించి వందశాతం మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌తో అరంగేట్రం చేసిన వైభవ్ మూడు మ్యాచుల్లోనే ఆడాడు. అతడిని తప్పించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. మరోవైపు ఇంగ్లాండ్‌పై విఫలమైన వైభవ్.. జింబాబ్వేపై సత్తా చూపించాల్సిన అవసరం ఉంది. "ఐపీఎల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టా. ఈ నాలుగు నెలల్లోనే నేను ఒడుదొడుకులను చూశా. క్రికెట్‌లో ఇవన్నీ సహజమేనని తెలుసు. నా సన్నద్ధతను మాత్రం ఆపలేదు. మళ్లీ ఎప్పుడు ఆడే అవకాశం వచ్చినా నా బెస్ట్ ప్రదర్శన ఇస్తా. క్రికెట్‌లో మనం అనుకున్నవన్నీ ఒక్కోసారి జరగకపోవచ్చు. కానీ, అందుకోసం ప్రయత్నించడం మాత్రం ఆపకూడదు. ఒక మ్యాచ్‌కు బెంచ్‌పై కూర్చున్నప్పుడు నిరాశ ఎదురు కావడం సహజమే. కానీ, చుట్టూ ఉండేవారు మద్దతు ఇచ్చినప్పుడు మళ్లీ ఎక్కువగా ప్రాక్టీస్ చేసి సిద్ధం కావాల్సిన అవసరం ఉంది " అని వైభవ్ తెలిపాడు. "హరారే మైదానం నాకు గుర్తుండిపోతుంది. నాలుగు నెలల కిందటే మేం ఇక్కడ అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఆడి గెలిచాం. భారీ శతకం చేశా. అందుకే, నాకు ఇది స్పెషల్ గ్రౌండ్. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమనేది ఎప్పటికీ మధురమైన క్షణమే. మళ్లీ ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది. నాకు ఇక్కడి పిచ్, వాతావరణంపై అవగాహన ఉంది. అవకాశం వస్తే తప్పకుండా మెరుగైన ఇన్నింగ్స్ ఆడతా. ఇక్కడి మైదానంలో మంచి రికార్డు ఉంది" అని వైభవ్ వెల్లడించాడు.

# విమర్శలకు కుంగిపోవద్దు

## నిర్భయంగా ఆడండి : శ్రేయస్ అయ్యర్



బయటి నుంచి వస్తున్న విమర్శలకు కుంగిపోకుండా నిర్భయంగా ఆడాలని భారత ఆటగాళ్లకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచించాడు. టీమ్‌ఇండియా ఇటీవల ఇంగ్లాండ్, ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ల్లో ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేదు. దీంతో భారత జట్టుపై విమర్శల దాడి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా.. జింబాబ్వే పర్యటనకు వెళ్లింది. గురువారం నుంచి భారత్ ఆ జట్టుతో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. తొలి మ్యాచ్‌కు ముందు కెప్టెన్ శ్రేయస్ మీడియాతో మాట్లాడాడు. "ఇంగ్లాండ్ పర్యటనలో మేము కొంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నాం. కానీ, దాని నుంచి చాలా సానుకూల అంశాలు నేర్చుకున్నాం. భవిష్యత్తులో ఒక జట్టుగా మేము ఏం చేయాలి, మైదానంలో అడుగుపెట్టినప్పుడు ఎలాంటి మనోస్థైర్యం కలిగి ఉండాలి అనే విషయాలను తెలుసుకున్నాం. మాలో కొందరు ఇక్కడ మొదటిసారి ఆడుతున్నారు. కాబట్టి మేం పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడితే అంత మంచి ఫలితాలను సాధిస్తాం. ఆటగాళ్లు వైఫల్యాల గురించి భయపడొద్దు. ఎందుకంటే మనసులో అలాంటి ఆలోచనలు ఉంటే మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికే ఆడతారు. మీకు ఆ భయం లేనప్పుడు మీలోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తీసుకొస్తారు. బయట జనాలు ఏమంటున్నారనే దాని గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. మనం వర్తమానంలో ఉండాలి. ఒక జట్టుగా కలిసికట్టుగా ఎంత మంచి క్రికెట్ ఆడితే అదే స్థాయిలో ఫలితం వస్తుంది. మేం ఇంగ్లాండ్ నుంచి నిన్నే వచ్చాం. ఈ రోజు ప్రాక్టీస్ సెషన్. రేపు మ్యాచ్. ఇది చాలా సవాలుతో కూడుకున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రాణిస్తే ఆ ఫీలింగ్ చాలా బాగుంటుంది. గత సిరీస్‌ల్లో ఫలితాలు మాకు అనుకూలంగా రాలేదు. కానీ, అది జట్టు సభ్యులను మరింత దగ్గర చేసింది. ఇకపై ఒక జట్టుగా ఎలా ఆడాలనే దానిపై చర్చలు జరుపుతున్నాం" అని శ్రేయస్ వివరించాడు.

## యార్క్‌షైర్‌తో కుల్‌దీప్ యాదవ్ ఒప్పందం



ఇటీవల ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అన్ని మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. జింబాబ్వేతో జరగబోయే టీ20 సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేయలేదు. దీంతో కుల్‌దీప్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్ టీమ్ యార్క్‌షైర్‌తో అతను ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న వన్డే కప్‌లో ఐదు మ్యాచ్‌లు, సెప్టెంబర్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో మూడు మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఇంగ్లాండ్‌లో ఉన్న కుల్‌దీప్ యార్క్‌షైర్ జట్టుతో కలిశాడు. శుక్రవారం గ్లామోర్గాన్‌తో జరిగే మ్యాచ్‌కు ఈ స్పిన్నర్ అందుబాటులో ఉంటాడు. అతను ఇంగ్లాండ్‌లో దేశవాళీ క్రికెట్ ఆడటం ఇదే తొలిసారి. యార్క్‌షైర్ తరఫున గతంలో సచిన్ తెందూల్కర్, యువరాజ్ సింగ్ కూడా ఆడారు. "యార్క్‌షైర్ జట్టులో చేరడం నాకు చాలా సంతోషంగా ఉంది. గొప్ప చరిత్ర కలిగిన ఈ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించడం నిజంగా ఒక గౌరవం. ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లో ఆడటంలోని సవాలును ఎప్పుడూ ఆస్వాదిస్తుంటాను. యాజమాన్యంతో మాట్లాడిన తర్వాత జట్టులో చేరడానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నాను" అని కుల్‌దీప్ పేర్కొన్నాడు.

## త్వరలో భారత్‌కు తిరిగొస్తా: లలిత్ మోదీ



ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ 16 ఏళ్ల తర్వాత తిరిగి భారత్‌కు రానున్నారు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో స్వదేశానికి రావాలనుకుంటున్నానని తెలిపారు. 2009 నాటి ఐపీఎల్ విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం కేసులో లలిత్ మోదీకి అప్పిలేట్ ట్రైబ్యూనల్ ఊరటనిచ్చింది. ఈ తీర్పు అనంతరం ఆయన వీడియో విడుదల చేశారు. 16 ఏళ్లుగా సాగిన న్యాయపోరాటానికి ట్రెబ్యునల్ తీర్పు ముగింపు పలికిందన్నారు. ఫెమా కేసు నమోదు కావడంతో 2010 నుంచి లలిత్ మోదీ భారత్‌ను వీడి విదేశాల్లో నివసిస్తున్న సంగతి తెలిసిందే. "ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు పట్ల సంతోషంగా ఉంది. నిజంగా ఇది ఒక గొప్ప రోజు. గత పదహారేళ్లుగా పోరాడుతూ వచ్చాను. మీడియాకు, అందరికీ నేను చెబుతూ వచ్చిన విషయాలే చివరికి నిజమని తేలాయి. ట్రిబ్యునల్ నా పక్షాన తీర్పు ఇవ్వడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఐపీఎల్ విజయవంతం కావడం గురించి మాత్రమే నేను ఆలోచించాను. ఆ టోర్నీ అంటే నాకెంతో ఇష్టం. ఇప్పుడు ఆ అధ్యాయం ముగిసింది. నేను నా జీవితంలో ముందుకు సాగబోతున్నాను. భారత్‌కు తిరిగి రావడానికి ఎదురుచూస్తున్నాను. ఈ సంవత్సరం చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు వస్తా. అక్టోబర్‌లో నా కుమార్తె బిడ్డకు జన్మనివ్వనుంది. అంతా సవ్యంగా జరుగుతుందని ఆశిస్తున్నాను." అని లలిత్ మోదీ పేర్కొన్నారు. 2009లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో ఐపీఎల్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. టోర్నీ నిర్వహణకు జరిపిన నిధుల బదిలీ ప్రక్రియలో ఆర్‌బీఐ అనుమతులు తీసుకోలేదని, విదేశీ మారక ద్రవ్య నిబంధనలకు ఉల్లంఘించారంటూ లలిత్ మోదీతోపాటు మరికొందరిపై ఈడీ కేసులు నమోదు చేసింది. లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించింది. సుదీర్ఘ విచారణ అనంతరం అప్పిలేట్ ట్రైబ్యూనల్ లలిత్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది.




## రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.

## ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.



## స్పిరిట్ 40శాతం షూటింగ్ పూర్తి

### కీలక అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ–సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

## బాలీవుడ్ నుంచి వెళ్లిపోవడానికి కారణమిదే : ప్రియాంక

ప్రియాంకా చోప్రా తనదైన నటనతో హిందీ చిత్రపరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, కెరీర్ ఉన్నత దశలో ఉన్నప్పుడు ఆమె బాలీవుడ్‌ను ఎందుకు వదిలేశారన్న ప్రశ్న చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. "కొందరిని మెప్పించనందుకు.. వారు చెప్పినట్లు చేయనందుకు నా సినిమా అవకాశాలు మరొకరికి ఇచ్చారు. ఇతరులు రాజీ పడినట్లుగా.. వాళ్లకు అనుకూలంగా మారేందుకు నేను ఇష్టపడలేదు. ఈ విషయం గురించి నేను ఎక్కువగా మాట్లాడను. కొందరు అగ్ర హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారు. 2007లో 'సలామ్-ఎ-ఇష్క్' షూటింగ్ సమయంలో నేను మరో సినిమాలో నటించాల్సి ఉంది. ఆ చిత్ర హీరో ఒకరోజు నా సెట్‌కు వచ్చారు. తర్వాత నెలలోనే మా సినిమా షూటింగ్ ప్రారంభం కానుండటంతో.. నాకు మద్దతుగా వచ్చారని అనుకున్నా. కానీ, ఆయన ఊహించని మాట చెప్పారు. 'దర్శకుడు పొరపాటున ఈ సినిమా నీకు ఇచ్చారు. నిజానికి ఈ పాత్ర మరో హీరోయిన్ చేయాల్సింది. మనం భవిష్యత్తులో మరో సినిమా చేద్దాం. ఈ విషయం నీకు స్వయంగా చెబుదామనే వచ్చా' అని చెప్పారు. ఇలా ఒకసారి కాదు.. చాలాసార్లు జరిగింది. ఆ పరిస్థితుల్లో నా కెరీర్ గురించి ఆలోచించాను. నా నటనపైనే పూర్తి దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను. నా కష్టమే నా కెరీర్‌ను నిలబెట్టి, మరిన్ని అవకాశాలు తెచ్చిపెట్టింది" అని ప్రియాంక గుర్తుచేసుకున్నారు.

ఇక, మహేశ్ బాబు కథానాయకుడిగా, రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'వారణాసి'లో ప్రియాంక కనిపించనుంది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా, వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది.



## 'ప్రళయ్'లో కళ్యాణి ప్రియదర్శన్

తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించిన యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. గతేడాది ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'లోకా: చాప్టర్ 1' చిత్రం ఏ స్థాయి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మలయాళ సినీ పరిశ్రమలోనే అత్యధిక వసూళ్లు సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించడంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉన్న కళ్యాణి, త్వరలోనే 'లోకా: చాప్టర్ 2' షూటింగ్‌లో పాల్గొనడమే కాకుండా బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్, జై మెహతా కాంబోలో రాబోతున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రళయ్'లో కళ్యాణి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు పుకార్లు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. కానీ దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అభిమానులు అయోమయంలో పడిపోయారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఆగస్ట్‌లో ప్రారంభం కాబోతుందట. సుమారు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ జాంబీ ప్రపంచంలో, కళ్యాణి కేవలం రొమాంటిక్ సీన్లకే పరిమితం కాకుండా హాలీవుడ్ రేంజ్‌లో భారీ ఫైట్లు చేయబోతున్నట్లు టాక్. ఈ సాహసోపేతమైన స్టంట్స్ కోసం విదేశీ యాక్షన్ కోచ్‌ల దగ్గర ఆమె ప్రత్యేక శిక్షణ కూడా పొందుతోందట.





## సంక్రాంతి బరి నుంచి చిరు తప్పుకున్నారా?

ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచుకోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గరిష్ట స్థాయిలో వసూళ్లు రావాలంటే పోటీ లేకుండా సోలోగా విడుదల చేయడం ఉత్తమమనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి సమయంలో కనీసం రెండు లేదా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో, కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారట. అందుకే సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని సమ్మర్ లేదా మరో అనుకూలమైన ఫెస్టివల్ సీజన్‌లో సినిమాను విడుదల చేసే అంశంపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఆలయ ఉత్సవాల్లో విజయ్, త్రిషలతో బ్యానర్

### ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష పేర్లు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తరచూ చర్చకు వస్తున్నాయి. వీరిద్దరి గురించి పలు రకాల ప్రచారాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడులో జరిగిన ఓ ఆలయ ఉత్సవంలో విజయ్, త్రిష చిత్రాలతో ఏర్పాటు చేసిన బ్యానర్ ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. తమిళనాడులోని సేలం జిల్లా ఆత్తూర్‌లో జరుగుతున్న మారియమ్మన్ ఆలయ ఆషాఢ ఉత్సవాల సందర్భంగా కొందరు యువకులు ప్రత్యేక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బ్యానర్‌లో విజయ్‌ను పది తలల రావణాసురుడి రూపంలో, త్రిషను అమ్మవారి రూపంలో చిత్రీకరించారు. ఈ డిజైన్ స్థానికంగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా వేగంగా వైరల్ అయింది. బ్యానర్ బయటకు రావడంతో నెటిజన్లు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ ఉత్సవాల్లో సినీ ప్రముఖుల చిత్రాలను ఈ విధంగా ఉపయోగించడం సరికాదని పలువురు విమర్శించారు. ముఖ్యంగా దేవతా రూపాలతో నటీనటులను పోల్చి చూపడంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. వివాదాస్పద బ్యానర్‌ను తొలగించడంతో పాటు, దానిని ఏర్పాటు చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com